కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు



పాన్‌గల్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

- కేంద్రాలు ప్రారంభించినా.. సేకరించని ధాన్యం
- రైతులకు తప్పని ఇబ్బందులు

పాన్‌గల్: మద్దతు ధర కోసం ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతుండటంతో రైతులు కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులు దాటినా నేటికి కొనుగోలు ప్రారంభించలేదు. దీంతో కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలోని వరి కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించి వారం రోజులు దాటింది. నేటికీ ఆయా కేంద్రాల్లో తేమశాతం లేదని, సంచులు రాలేదని, కేంద్రాలకు వచ్చిన ధాన్యం కాంటా చేసినా లారీ నిండని పరిస్థితి ఉందనే కారణాలతో కాలం వెళ్లదీస్తున్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం కాంటా చేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలో 16 కొనుగోలు కేంద్రాలకు గాను ఇప్పటికి మాందాపూర్, రేమద్దుల, అన్నారం మినహా ఎక్కడా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 20కి పైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఇప్పటికీ ఒక్క అన్నారం కేంద్రం మినహా ఎక్కడా కొనుగోలు ప్రారంభించలేదు. కాంటా ఎప్పుడు చేస్తారని రైతులు అధికారులను ప్రశ్నిస్తే ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన చేయడంతో ఇబ్బందులు తప్పడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్‌కు మొగ్గు..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించేందుకు రోజుల తరబడి పడిగాపులు పడలేక ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులు ప్రభుత్వం ఇచ్చే ధర క్వింటాళ్లకు రూ.2300 ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు తేమ శాతం సరిపోయినప్పుడు కొనుగోలు కేంద్రాల్లో ఎందుకు ధాన్యం కాంటా చేయడంలేదని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కాంటా చేసి ఇబ్బందులు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

పదిరోజులుగా కేంద్రంలోనే..



పాన్‌గల్‌లోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 10 రోజులు దాటినా కాంటా చేయడం లేదు. దీంతో కేంద్రంలో పడిగాపులు కాస్తున్నాం. ధాన్యం ఆర బెట్టేందుకు ప్రైవేట్‌లో కవర్లు(పడాలు)కిరాయికి తీసుకొచ్చాం. ఇటూ కిరాయితో పాటు చలికి పడిగాపులు పడుతున్నాం. ఇప్పుడు, అప్పుడు అంటూ కాలయాపన తప్పా కాంటా చేయడంలేదు. ఒక పక్క ప్రైవేట్ వ్యక్తులు కాంటా చేసుకుంటున్నారు. వారికి అమ్మిన పడిగాపులు తప్పేవి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– తెలుగు పరశురాం, పాన్‌గల్

వెంటనే కొనుగోలు చేస్తాం

కేంద్రాల్లోని ధాన్యం తేమశాతం రాకపోవడంతో పాటు సంచులు రావడంలో కూడా జాప్యం జరిగింది. దీంతో కాంటా చేయడంలో కొంత ఆలస్యమైంది. ఆయా కేంద్రాల్లో సంచులు వచ్చిన వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతుల ఇబ్బందులు తొలగిస్తాం.

– భాస్కర్‌గౌడు, సీఈఓ, పీఏసీఎస్, పాన్‌గల్

క్లుప్తంగా

కల్వరాలలో 19న మెగా వైద్య శిబిరం

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలో 19న జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నర్సింహ తెలిపారు. ఆమన్‌గల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలతో పాటు శ్రీరంగాపూర్, పాన్‌గల్, పెంట్లవెల్లి మండలాల ప్రజలు ఈ వైద్య శిబిరంలో పాల్గొని డాక్టర్ల సలహాలు తీసుకోవాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పిర్యానాయక్ కుమారుడు కిశోర్‌నాయక్ బుద్దారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొని మాజీ ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం తండాకు చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు వెంకటయ్యనాయుడు, చంద్రూనాయక్, గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సమాజానికి మరిన్ని రచనలు అందించాలి



శాంతినగర్: సమాజానికి అవసరమైన రచనలు భవిష్యత్తులో మరిన్ని అందించాలని శాంతినగర్ సేవా సమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్‌ను జిల్లా గ్రంథాలయాల చైర్మెన్ నీలి శ్రీనివాసులు కోరారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌కు చెందిన సేవాసమితి సభ్యుడు అస్లాం షరీఫ్ గద్వాలలో ఆదివారం జరిగిన 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మర్యాద పూర్వకంగా గ్రంథాలయాల చైర్మన్ నీలి శ్రీనివాసులును కలిసి తాను రచించిన నవ్వులే నవ్వులు పుస్తకాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జోక్స్ పుస్తకాలతో పాటు సమాజానికి అవసరమైన వివిధ రచనలు రచించాలని ఆకాంక్షించారు. చైర్మన్ కోరికను తప్పక నెరవేరుస్తానని అస్లాం షరీఫ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, రాజోళి మండల మాజీ వైస్ ఎంపీపీ రేణుక దంపతులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మృతి

అలంపూర్ : శ్రీజోగుళాంబ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతి రెడ్డి(75) ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరబాద్‌లోని వారి నివాసంలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందినట్లు పేర్కొన్నారు. అంత్యక్రియలు ఉండవెల్లి మండలం కలుగోట్ల గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తిరుపతి రెడ్డి అలంపూర్ శ్రీజోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, గ్రామ ప్రజలు ఆయన భౌతికాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు.

క్రీడలతో మానసికోల్లాసం



గద్వాల అర్బన్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని మైనార్టీ సబ్ ప్లాన్ నాయకుడు అతిఖుర్ రహ్మాన్ అన్నారు. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రహ్మాన్ మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించి గద్వాలకు మంచి పేరు తీసుకోరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కదాడిలో 30 గొర్రెపిల్లలు మృత్యువాత

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో గొల్లరాముడుకు చెందిన గొర్రె పిల్లల మందపై వీధి కుక్క దాడి చేసి 30 గొర్రె పిల్లలను చంపింది. చుట్టు పక్కల పొలంలో ఓ రైతు గమనించి గొర్రెల యాజమానికి విషయం తెలుపంగా మంద దగ్గరకు వచ్చి కుక్కను చంపేశాడు. సుమారు రూ.1.50 లక్షలు నష్టం జరిగినట్లు గొర్రెల యాజమాని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున అదుకోవాలని కోరారు.

ముగిసిన కోటిలింగాల ప్రతిష్ఠా మహోత్సవం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం విజయవంతంగా ముగిసింది. కోటిలింగాల ప్రతిష్ఠమహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రుద్రహోమం, రుద్రపఠనం నిర్వహించి, 20 శివకోటి యంత్రాలకు పూజలు చేశారు. భక్తులు స్వయంగా పదకొండు వేల శివలింగాలను ప్రతిష్ఠించి శివానుగ్రహం పొందారు. అపూర్వ కార్యక్రమం ద్వారా భక్తులు తమ ఆధ్యాత్మికతను చాటుకున్నారు.



కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమరచింతలో ‘దొడ్డురకం’ కొనుగోలు కేంద్రం

- అన్ని చోట్ల సన్నరకం కొనుగోలు కేంద్రాలు
- ఇదేక్కడి చోద్యమంటున్న రైతులు

అమరచింత: వానాకాలం పంట సాగులో అత్యధికంగా జిల్లా మొత్తంలో సన్నరకం వరిని కొనుగోలు చేస్తుంటే, అధికారులు అమరచింతకు మాత్రం దొడ్డురకం వరిని కొనుగోలు చేసేందుకు పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత వారం రోజుల క్రితం ప్రారంభించిన అధికారులు తమకు దొడ్డురకం వరిని కొనుగోలు కేంద్రం మంజూరైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. తమకు సన్నరకం కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో రైతులు మాత్రం తాము పండించిన సన్నరకం వరి పంటను ఎవరికి అమ్మాలో అర్థంకాక ధర తక్కువైనా దళారులకే అమ్ముకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. అమరచింత ఎత్తిపోతల, పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో రైతులు అత్యధికంగా సన్నరకం వరిపంటను పండించారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ కోసం రైతులు స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సమీపంలోని రంగాపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని సలహా ఇస్తున్నారు. దీంతో రైతులకు రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, అధికారులు స్పందించి స్థానికంగా సన్నరకం వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



అమరచింత శివారులోని ప్రైవేట్ వెంచర్‌లో ఆరబోసిన వరిధాన్యం

ఉచిత నిర్బంధ విద్య అమలు చేయాలి

సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి

ఆత్మకూర్: భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ఏ, 45 ప్రకారం దేశంలోని 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని ఆత్మకూర్ సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని, ఆరేళ్లలోపు చిన్నారులందరికి పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదిగా చేస్తూ గతంలో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షనీయమని, ఎలాంటి షరతులు లేకుండా ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని కోరారు.

అమలుకు హైకోర్టు ఉత్తర్వులు..

ఉచిత నిర్బంధ విద్య అమలు కోసం హైకోర్టులో వేసిన పిటిషన్‌కు చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించి తీర్పును వెలువరించారని, అందుకు సంబందించిన ప్రతులు తనకు అందాయని న్యాయవాది తిప్పారెడ్డి తెలిపారు. ఈ విషయమై తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ 2025–26 విద్యాసంవత్సరంలో 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని అంగీకరించారన్నారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టి సారించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టలేక చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, నారాయణపేట జిల్లాలోని మక్తల్‌ను రెవిన్యూ డివిజన్‌గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న న్యాయవాది తిప్పారెడ్డి

ఆకుముడత తెగులుతో ఇబ్బందులు

వీపనగండ్ల: జిల్లాలో అత్యధిక మామిడి పంటను సాగు చేస్తున్న రైతులు 10 రోజులుగా మామిడి తోటలకు ఆకుముడత, మచ్చ తెగులుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, కల్వరాల, వీపనగండ్ల తదితర గ్రామాల్లో దాదాపు 8 వేల ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తోటలు సాగు చేస్తున్న రైతులకు సబ్సిడీ ద్వారా ఎరువులు, మందులు అందజేస్తామని అధికారులు ఆర్భాటపు ప్రకటనలు చేశారు తప్ప ఎలాంటి సహాయం అందలేదని రైతులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులను ఆదుకునేందుకు అవసరమైన అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మార్కెట్ వసతులను ముందస్తుగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఆకుమచ్చ తెగులు సోకిన మామిడి తోట


4,780 కుటుంబాల సర్వే పూర్తి



వీపనగండ్ల: మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో ఆదివారం వరకు 4,780 కుటుంబాల సర్వేను పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో మొత్తం 7046 కుటుంబాలున్నాయని, ఇప్పటికి 67 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. గ్రామాల్లో సర్వే చేసేందుకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించి పూర్తి వివరాలు తెలియజేయాలని ఆయన కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రేపు ఊరడమ్మ ఉత్సవాలు





అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన ఊరడమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం కొనసాగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శుభ్ర పరిచి రంగులతో అలంకరించే పనుల్లో ఆలయ నిర్వహకులు నిమగ్నమయ్యారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవతగా పూజలందుకుంటున ఊరడమ్మ దేవత ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అమ్మవారికి తీపి వంటకాలతో నైవేద్యం సమర్పించడం ప్రత్యేకత. ఉరేడమ్మ జాతరలో జంతుబలులు ఉండవని, ఇది సంప్రదాయమని నిర్వహకులు తెలిపారు.

త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రచారం



ఆత్మకూర్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లో ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మాసం పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు సందేశాలు, భగవద్గీత శ్లోకాలు ఉచ్చరించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంచి పెట్టారు. డిసెంబర్ ఒకటి వరకు కార్తీక మాసం ఉంటుందని, ప్రతి ఒక్కరు దీపాలు వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు, కొత్తకోట, మదిగట్ల ప్రబోధ సేవాసమితి నిర్వహకులు విజయ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య, మాసన్న, శాంతి, అనిత, వెంకటమ్మ, భక్తులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో 40మంది విద్యార్థులు పాల్గొని చక్కటి ప్రతిభను ప్రదర్శించారు. బేసిక్ మూమెంట్స్, కటాస్, కిక్స్, లిఫ్టింగ్ వంటి విభాగాల్లో ప్రతిభ చూపించిన వారు బెల్టులు, సర్టిఫికెట్లు సాధించారు. ఈ పరీక్షల్లో 10మంది ఎల్లో బెల్ట్, 8మంది ఆరెంజ్ బెల్ట్, 8మంది బ్లూ బెల్ట్, 8మంది మెరూన్ బెల్ట్, 6 మంది సీనియర్ బ్రౌన్ బెల్ట్, సర్టిఫికెట్లు పొందారు. కరాటే అకాడమీ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఈ బెల్ట్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్స్ ఎస్ వెంకటేష్, రఫీ ఖాద్రి, ఇఫ్తార్ జాఫర్, సాదిక్, హరీష్, యాదవ్, మంజునాథ్, పరమేష్, రియాజ్, శివరాజ్, కురుమూర్తి, అంజి, మొహమ్మద్ జాంగీర్ తదితరులు విద్యార్థులను అభినందించారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సీనియర్ కరాటే మాస్టర్లు

వరిధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలి

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కాంటా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం మండల నాయకులు భీమయ్య, సూర్యవంశ రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి ప్రారంభించి వారం రోజులవుతున్నా నేటికి కాంటా చేయకపోవడంతో రైతులు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారన్నారు. సన్న రకం వడ్లకు ఇస్తున్న రూ.500 బోనస్‌ను దొడ్డు వడ్లకు కూడా అందించాలన్నారు. దీంతో పాటు కేంద్రాల్లో నీడ కోసం టెంట్, నీటి వసతి కల్పించాలన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటా చేయాలని లేనిచో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమలాకర్, రైతులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

‘ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం’

మదనాపురం: ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని, ఎట్టి పరస్థితుల్లో జరిగేది లేదని ఎస్సీ వర్గకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ ములకలపల్లి మద్దిలేటి పిలుపు నిచ్చారు. ఆదివారం దుప్పల్లిలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా నరేందర్, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, కోశాధికారిగా శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభ కరపత్రాలు విడుదల చేశారు. మాల ఉద్యోగులు, మహిళలు పెద్దలు వివిధ రకాల వ్యాపారస్తులు వివిధ రకాల కుల సంఘాల నాయకులు పాల్గొన్నాలని కోరారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న మాల నాయకులు

మొదలైన రోడ్డు పనులు



ఖిల్లాఘనపురం నుంచి పర్వతాపురం వెళ్లే రోడ్డుకు పోసిన మొర్రం

- అసంపూర్తిగా వెల్కిచెర్ల, ఖిల్లాఘనపురం బీటీ పనులు
- అధికారుల వత్తిడితో మొదలు పెట్టిన కాంట్రాక్టర్

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి భూత్పూర్ మండలం వెల్కిచెర్ల గ్రామం శివారు వరకు అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను ఎట్టకేలకు ప్రారంభించారు. ఈ రోడ్డు పూర్తిగా పాడవడంతో బీటీ రినివల్ వేసేందుకు ప్రభుత్వం ఆర్అండ్‌బీ ద్వారా నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను అసంపూర్తిగా చేసి వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పూర్తిగా గుంతలు ఏర్పడటంతో సంబంధిత కాంట్రాక్టర్ సల్కెలాపురం సమీపం నుంచి పర్వతాపురం వరకు రోడ్డు పనులు పూర్తి చేసి వదిలేశాడు. అక్కడి నుంచి ఖిల్లాఘనపురం వరకు రోడ్డును పట్టించుకోకపోవడంతో సంవత్సరం కాలంగా మండల కేంద్రానికి వెళ్లివచ్చే సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, పర్వతాపురం, ముందలితండా, వెనికితండా, బక్కతండా, మేడిబాయి తండాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు రోడ్డు సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో ఎట్టకేలకు స్పందించిన కాంట్రాక్టర్ రోడ్డు పనులు ప్రారంభించారు.

రూ.4కోట్లు మంజూరు..

మండల కేంద్రం నుంచి వెల్కిచెర్ల శివారు వరకు మొత్తం 14 కిలో మీటర్ల రోడ్డుకు బీటీ రినివల్ కోట్ వేయడంతో పాటుగా అవసరమైన ప్రాంతాల్లో పాడుబడిన బావుల దగ్గర ప్రమాదాల నివారణకు రక్షణ గోడలు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినప్పటికి మధ్యలోనే వదిలేశాడు. పర్వతాపురం నుంచి మండల కేంద్రానికి రోడ్డు పనులు కాంట్రాక్టర్ ప్రారంభించారు. పూర్తిగా పాడైన దగ్గర బీటీని మొత్తం తొలిగించి మొర్రం పోయడం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలిగించి మొర్రం వేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే బీటీ రినివల్ కోట్ వేయిస్తాం..

మండల కేంద్రం నుంచి పలు గ్రామాల మీదుగా వెల్కిచెర్ల వరకు ఉన్న బీటీ రోడ్డుకు రినివల్ కోట్ వేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావడం జరిగింది. కాంట్రాక్టర్ రక్షణగోడలు కట్టడంతో పాటు పర్వతాపురం వరకు రోడ్డు పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి ఖిల్లాఘనపురం వరకు ఉన్న రోడ్డు పనులు ప్రారంభించారు. త్వరలో బీటీ రినివల్ పనులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రాకేష్, ఏఈ ఆర్అండ్‌బీ

వైభవంగా గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ

కొత్తకోట రూరల్: మండలంలోని నాటవెల్లి గ్రామ సమీపంలోని మానవత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఆదివారం గోపాలకృష్ణ విగ్రహప్రతిష్ఠ, గణపతి, సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గోశాలలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, యోగశాలలో పతంజలి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, ఆరోగ్య శాలలో ధన్వంతరి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ, ధ్యాన క్షేత్రంలో బుద్ధ భగవానుడి విగ్రహ ప్రతిష్ఠ, విద్యా, జ్ఞానానికి సంబంధించి గురువు దక్షిణామూర్తి విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. కార్యక్రమంలో నాటవెల్లి గ్రామ ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విగ్రహాల ప్రతిష్ఠ విజయవంతంగా చేశారు. ఈ సందర్భంగా మానవత విశ్వవిద్యాలయ నిర్వహకులు శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అంతరించిపోతున్న మానవత విలువలు, గో పరిరక్షణ కోసం మానవులు చేపట్టాల్సిన కార్యాలపై అవగాహన కల్పించారు. భారతీయ సంస్కృతిని పూర్వ వైభవంతో పునరుద్ధరించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. విద్య, వైద్య విధానాలు, విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. భావి తరాలకు ఒక విలువలతో కూడిన, వ్యక్తిత్వ విశ్వాసంతో ఉన్న సమాజం నిర్మించడమే ప్రతి ఒక్కరి లక్ష్యమన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



నాటవెల్లి సమీపంలో మానవత విశ్వవిద్యాలయ ప్రాంగణంలో గోపాలకృష్ణ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు